చెరువుల్లా రహదారులు

- రోడ్లపై నిలిచిపోయిన వర్షం నీరు
- జలమయమైన గాజువాక రోడ్లు



పెదగంట్యాడ పీహెచ్‌సీ సమీపంలోని ప్రధాన రహదారిపై నిలిచిపోయిన వర్షం నీరు



వందడుగుల రోడ్డులో చెరువును తలపిస్తున్న వర్షం నీరు

గాజువాక: గాజువాకలో భారీ వర్షం కురిసింది. శనివారం అర్ధరాత్రి రాత్రి మొదలైన వర్షం ఆదివారం మధ్యాహ్నం వరకు పడింది. దీంతో పల్లపు ప్రాంతాల్లో నీరు భారీగా నిలిచిపోయింది. వివిధ ప్రాంతాల్లోని రోడ్లు చిత్తడిగా మారాయి. వర్షం వల్ల రాకపోకలకు వాహన చోదకులు అవస్థలు పడ్డారు. విస్తరణ పనులు జరుగుతున్న పాత గాజువాక దరి జాతీయ రహదారి బురదమయంగా మారింది. వందడుగుల రోడ్డు, కుంచుమాంబ ఆలయం, శ్రీనగర్ జంక్షన్ సమీపంలో నీరు భారీగా నిలిచిపోయింది. వివిధ కాలనీల్లో కాలువలు పొంగి రోడ్లపైకి ప్రవహించాయి.

నీరు పోయే మార్గమేదీ!

పెదగంట్యాడ: చినుకు పడితే చాలు మండలంలోని పలు ప్రాంతాలు చిత్తడిగా మారుతున్నాయి. నీరు పోయే మార్గం లేక రోడ్లపైన, ఆట స్థలాలు చెరువును తలపిస్తున్నాయి. దీంతో స్థానికులు అవస్థలు పడుతున్నారు. మండలంలో శనివారం రాత్రి నుంచి ఆదివారం ఉదయం 11.30 గంటల వరకూ భారీగా వర్షం కురిసింది. గెడ్డలు, కాలువలు పొంగి పొర్లాయి. రోడ్లన్నీ చెరువులను తలపించాయి. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి.

- నెల్లిముక్కు ప్రధాన రహదారిలో పెదగంట్యాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎదుట నీరు నిలిచిపోయింది. వాహనచోదకులు అందులో నుంచే రాకపోకలు సాగించాల్సిన దుస్థితి నెలకొంది.
- జీవీఎంసీ 76వ వార్డు పరిధిలోని నడుపూరు నడిబొడ్డున ఉన్న ఉక్కు కళావేదిక ఎదురుగా గల ఆట స్థలం చెరువులా మారింది. దీంతో క్రీడాకారులు ఇబ్బందులు పడుతున్నారు. పరిస్థితి ఇలా ఉన్నా అటు ఉక్కు అధికారులు గానీ, ఇటు జీవీఎంసీ అధికారులు గానీ పట్టించుకోకపోవడం శోచనీయం.



ఉక్కు కళావేదిక వద్ద గల ఆట స్థలంలో నిలిచిపోయిన వర్షం నీరు

- బర్మా కాలనీలోని తుపాను భవనం ఆవరణం కూడా వర్షపునీటితో నిండిపోయింది. 75వ వార్డు పరిధిలోని కండిపిల్లి వారి వీధి జలమయమైంది. ఇళ్లలోకి వర్షపునీరు రావడంతో స్థానికులు అవస్థలు పడ్డారు.

‘ఉక్కు’ సమస్యలపై ఒత్తిడి పెంచాలి

ఎంపీ సత్యవతికి పోరాట కమిటీ విజ్ఞప్తి



ఎంపీ సత్యవతికి వినతిపత్రం అందజేస్తున్న పోరాట కమిటీ నాయకులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనుల కేటాయింపు, ప్రైవేటీకరణ నిలుపుదల తదితర సమస్యలపై కేంద్ర ప్రభుత్వంపై మరింత ఒత్తిడి పెంచాలని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు, అనకాపల్లి పార్లమెంట్ సభ్యులు, పార్లమెంట్ కోల్, మైన్స్ అండ్ స్టీల్ స్టాండింగ్ కమిటీ సభ్యులు డాక్టర్ బి.వి. సత్యవతిని కోరారు. ఆదివారం పోరాట కమిటీ నాయకులు ఎంపీని కలిసి ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. ఎన్.ఎం.డి.సి, సెయిల్ నుంచి ముడి సరకును ఉత్పత్తి ధరకు ఇప్పించి, కోల్ ఇండియా, రైల్వే సంస్థలతో మాట్లాడి ఎటువంటి ఆటంకం లేకుండా బొగ్గు నిరంతరం సరఫరా చేసేలా చూడాలన్నారు. క్యాపిటల్ రీస్ట్రక్చర్ చేసి తక్కువ వడ్డీతో బ్యాంకుల నుంచి రుణ సౌకర్యం వచ్చేలా చూడాలన్నారు. సెయిల్ మాదిరిగా నూతన వేతనాలు అమలు జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. మిగిలిన నిర్వాసితులందరికీ శాశ్వత ఉపాధి కల్పించాలని కోరారు. దీనిపై ఎంపీ మాట్లాడుతూ ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ కేంద్ర ప్రభుత్వం, ప్రధానమంత్రి, కేంద్ర మంత్రులు అందరికీ తమ అభిప్రాయాన్ని తెలియజేశామన్నారు. ఉత్పత్తికి ఆటంకం కలుగకుండా తమ వంతు ప్రయత్నం చేస్తామని హామీ ఇచ్చినట్టు పోరాట కమిటీ నాయకులు తెలిపారు. కార్యక్రమంలో డి. ఆదినారాయణ, మంత్రి రాజశేఖర్, జె. అయోధ్య రామ్, వై. మస్తానప్ప, నీరుకొండ రామచంద్రరావు, గణపతిరెడ్డి, బి.అప్పారావు, వి.మహాలక్ష్మినాయుడు, కొణతాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఉక్రోషంతోనే ఉత్పత్తి నిలిపివేత



766వ రోజు దీక్షలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ నిర్ణయానికి వ్యతిరేకంగా కార్మికవర్గం ఉద్యమిస్తుందన్న ఉక్రోషంతోనే స్టీల్‌ప్లాంట్‌లో ఉత్పత్తిని నిలిపివేసి కార్మికుల జీవితాలతో ఆడుకుంటున్నారని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు అన్నారు. ఈ మేరకు కూర్మన్నపాలెం కూడలి వద్ద జరుగుతున్న ఉక్కు రిలే నిరాహార దీక్షలు ఆదివారం నాటికి 766వ రోజు చేరుకున్నాయి. ఈ దీక్షా శిబిరంలో ప్లాంట్‌లోని పలు విభాగాల కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. కేంద్ర ప్రభుత్వం విశాఖ ఉక్కును ఎందుకు ఇంత చిన్నచూపు చూస్తోందని ప్రశ్నించారు. ప్రైవేటీకరణలో భాగంగానే ఉత్పత్తిని నిలిపివేస్తున్నారని, వీరి ప్రయత్నాలు సాగవని హెచ్చరించారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రభుత్వ రంగంలోనే కొనసాగాలని రాష్ట్ర ప్రజలు, సంస్థకు భూములిచ్చిన నిర్వాసితులు కోరుతున్నారన్నారు. ప్లాంట్ ప్రైవేటీకరణ విషయంలో కేంద్రానికి ఉక్కు కార్మికులతో పాటు ఆంధ్రరాష్ట్ర ప్రజలు సైతం తగిన గుణపాఠం చెబుతారని అన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం తన నిర్ణయాన్ని మార్చుకోవాలని, పార్లమెంట్‌లో ఉపసంహరణ బిల్లును ప్రవేశ పెట్టాలని, లేనిచో తమ పోరాటాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

ఎట్టకేలకు పూడిక తరలింపు



లారీలో పూడిక తరలిస్తున్న దృశ్యం

సాక్షి ఎఫెక్ట్..

పెదగంట్యాడ: జీవీఎంసీ 76వ వార్డు పరిధి పెదనడుపూరు, బర్మా కాలనీల్లోని ప్రధాన గెడ్డల్లోంచి తొలగించిన పూడికను ఆదివారం ఎట్టకేలకు తరలించారు. అధికారుల నిర్లక్ష్యం కారణంగా కాంట్రాక్టర్లు ఇష్టానుసారం వ్యవరించడంతో గెడ్డల్లోని పూడికలు తీసి తరలించకుండా అక్కడే వదిలేశారు. దీంతో ఆ పూడిక మళ్లీ అదే గెడ్డలోకి జారిపోతోంది. అంతేకాకుండా పందులు, కుక్కలు అక్కడికి చేరి చిందరవందర చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఇటీవల సాక్షి దినపత్రికలో ‘పూడిక తరలించాలి’శీర్షికన ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. గెడ్డ పక్కన కుప్పగా వేసిన పూడికను జేసీబీ సాయంతో లారీల్లో లోడు చేసి తరలించారు. దీంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

ఈ-వాహనాలతో కాలుష్యానికి చెక్



ఈ-వాహనాల వినియోగంపై అవగాహన కలిగిస్తున్న విజ్ఞాన్ రెక్టార్ మధుసూదనరావు

అగనంపూడి: కాలుష్యం కట్టడికి విదేశాల్లో విరివిగా ఈ-వాహనాలే వాడుతున్నారని, పూర్తి అవగాహన కలిగి ఉండడంతో ఇది సాధ్యమైందని దువ్వాడ విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాల రెక్టార్ వి.మధుసూదనరావు అన్నారు. ఎలక్ట్రికల్ వాహనాల పోకడలు, సవాళ్లు, అవకాశాలపై కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన ఐదు రోజుల సదస్సు ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుత రోజులతో పాటు భవిష్యత్‌లో కూడా ఈ-వాహనాలకు మంచి గిరాకీ ఉంటుందని, వాహనాల వాడకం పెరుగుతుందన్నారు. ఈ వాహనాల పనితీరు బ్యాటరీ సెల్స్ ఆకారం, పరిమాణం, పనితీరుపై ఆధారపడి ఉంటుందన్నారు. మరింత మెరుగు పర్చుకుని వినియోగదారులకు నాణ్యమైన వాహనాలు అందించేందుకు సంస్థలు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ బి.అరుంధతి, వైస్ ప్రిన్సిపాల్ కె.మధుసూదనరావు, కార్యక్రమ కోఆర్డినేటర్లు సుశాంత్‌కుమార్ సాహు, సీహెచ్‌వీ రమణ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన యోగా మహోత్సవాలు



యోగాసనంలో ఎన్‌సీసీ విద్యార్థులు, ప్రజలు



యోగా నేర్పిస్తున్న ఆంధ్రా యూనివర్సిటీ శిక్షకులు

మద్దిపాలెం: మద్దిపాలెం ఆర్ అండ్ బీ జంక్షన్ దరి ఎఫ్‌సీఐ గొడౌన్ సమీపంలోని శ్రీరామచంద్ర మిషన్ ఆశ్రమంలో మూడు రోజుల పాటు నిర్వహించిన యోగా మహోత్సవాలు ఆదివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా శ్రీరామచంద్ర మిషన్ విశాఖ మెట్రో జోనల్ కో ఆర్డినేటర్ వి.ఆర్.ఎస్.నాగశర్మ మాట్లాడుతూ శ్రీరామచంద్ర మిషన్, భారత ప్రభుత్వ సాంస్కృతిక శాఖ హార్ట్‌ఫుల్‌నెస్ సంస్థ సంయుక్తంగా ఈ నెల 17 నుంచి 19 వరకు ఏర్పాటు చేసిన యోగా శిక్షణ శిబిరానికి విశేష స్పందన లభించిందన్నారు. యోగాసనాలు, ప్రాణాయామం, ముద్రలు, యోగిక్ ట్రాన్స్‌మిషన్‌తో కూడిన హార్ట్‌ఫుల్‌నెస్ ధ్యాన శిక్షణలో వెయ్యి మందికి పైగా ఉత్సాహంగా పాల్గొన్నారని తెలిపారు. ఆంధ్రా యూనివర్సిటీ యోగా డిపార్ట్‌మెంట్ హెడ్ డాక్టర్ రమేష్, నిష్ణాతులైన వారి విద్యార్థులు శిక్షణ అందించారన్నారు. ఈ కార్యక్రమాన్ని భారత ప్రభుత్వపు ఇనీషియేటివ్ హర్ దిల్ ధ్యాన్, హర్ దిన్ ధ్యాన్ ప్రకారం నిర్వహించామని చెప్పారు. పెద్ద ఎత్తున ప్రజలు, విద్యార్థులు హాజరై ప్రయోజనాన్ని పొందినందుకు, విజయవంతంగా శిబిరం నిర్వహించినందుకు అందరికీ నిర్వాహకులు కృతజ్ఞతలు తెలియజేశారు. శ్రీరామచంద్ర మిషన్ విశాఖపట్నంలో 30కి పైగా ధ్యాన కేంద్రాలు ఉన్నాయని, ధ్యాన సాధన చేయడానికి లేదా కొనసాగించడానికి 96667 92133, 72075 75964 నంబర్లలో సంప్రదిస్తే వారివారి ప్రాంతాల్లో నిర్వాహకులు సేవలందించే ఏర్పాటు చేస్తామని నాగశర్మ వెల్లడించారు.

క్లుప్తంగా

నూకాంబిక అమ్మవారికి విశేష పూజలు



పూజలందుకుంటున్న నూకాంబిక అమ్మవారు

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 69వ వార్డు నాతయ్యపాలెంలో కొలువైన శ్రీ నూకాంబికా అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. ఆదివారం జరిగిన పూజా కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ నెల 21వ తేదీ కొత్త అమావాస్యను పురస్కరించుకుని నూకాంబికా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. అమ్మవారు విశేష అలంకరణలో భక్తులకు కనువిందు చేశారు.

భక్తిశ్రద్ధలతో గాయత్రీమాత పూజలు



తుంగ్లాంలోని సత్యశ్రీనివాస ఆలయంలో శ్రీ గాయత్రి హోమం నిర్వహిస్తున్న దృశ్యం

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 69వ వార్డు తుంగ్లాంలో గల శ్రీ సత్యశ్రీనివాస ఆలయంలో శ్రీ గాయత్రీ మాత 12వ వార్షికోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆదివారం ఆలయంలో గాయత్రీ మాత పూజా కార్యక్రమాలు నిర్వహించారు. వేకువ జాము నుంచే విఘ్నేశ్వర పూజ, మండపార్చన, గాయత్రీ హోమం వంటి పూజా కార్యక్రమాలు జరిగాయి. వార్డు కార్పొరేటర్ కాకి గోవిందరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. నారాయణ సేవ అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో కె. వెంకటరావు, కె.సాయిధర్మ, నావాన సింహాచలం, నందీశ్వరరావు, గిడితూరి అప్పారావు, రాకేష్, రాజేష్, గంగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తెలుగు పాటకు ఆస్కార్ గొప్ప విషయం



కళాసేవా పీఠంలో నాటు నాటు పాట గురించి మాట్లాడుతున్న సభ్యులు

గోపాలపట్నం: ఆర్ఆర్ఆర్ సినిమాలో నాటు నాటు పాటకు ఆస్కార్ అవార్డు రావడం చాలా సంతోషించ దగ్గవిషయమని గోపాలపట్నం కళా సేవా పీఠం అధ్యక్షుడు గొరకల రామదాసు అన్నారు. గోపాలపట్నంలోని పీఠం కార్యాలయంలో ఆదివారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఆస్కార్‌తో తెలుగు చిత్ర కీర్తి విశ్వవ్యాప్తమైందన్నారు. కార్యక్రమంలో సభ్యులు జి.అప్పారావు, డి.సింహాచలం నాయుడు, వెంకట్, శ్రీనివాసరావు, నూక రాజేశ్వరరావు, రామచంద్రరావు పాల్గొన్నారు.

మహిళల రక్షణకు పోష్ చట్టం

సీతంపేట: పనిచేసే ప్రదేశాల్లో మహిళలపై వేధింపులు జరగకుండా, వాటి నుంచి రక్షించడానికి భారత ప్రభుత్వం పీవోఎస్‌హెచ్(పోష్) చట్టాన్ని రూపొందించిందని సీఐఐ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్ డాక్టర్ ఉషా పంతుల అన్నారు. ఫ్యూచర్ ఆఫ్ వర్క్ స్పేసెస్ అనే అంశంపై డాక్టర్ లంకపల్లి బుల్లయ్య కళాశాలలో ఆదివారం జరిగిన అవగాహన సదస్సులో ఆమె ప్రసంగించారు. పోష్ చట్టం గురించి ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలన్నారు. మహిళా ఉద్యోగులకు సురక్షితమైన పని వాతావరణం కల్పించడం యజమానులకు ఈ చట్టం తప్పనిసరి చేస్తుందన్నారు. లైంగిక వేధింపుల ఫిర్యాదులను పరిష్కరించడానికి సంస్థల్లో అంతర్గత ఫిర్యాదుల కమిటీ ఏర్పాటు చేయాలని సూచించారు. మహిళలతో అభ్యంతరకరంగా మాట్లాడిన చట్టం ప్రకారం నేరంగా పరిగణిస్తారని చెప్పారు. చట్టం పరిధిలోకి వచ్చే అంశాలు, ఎలా ఫిర్యాదు చేయాలి, ఏ విధంగా రక్షణ పొందాలి తదితర అంశాలపై డాక్టర్ ఉషా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బుల్లయ్య కళాశాల ప్రిన్సిపాల్ డి.దీపక్ చౌదరి, వి.రాధాదేవి, శివజ్యోతి, అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

కోడి వ్యర్థాలతో ఇక్కట్లు



కాలువలోని కోడి వ్యర్థాలను ఆరగిస్తున్న పందులు



చట్టివానిపాలెం సర్వీసు రోడ్డు పక్కన కాలువలో పేరుకుపోయిన కోడి వ్యర్థాలు

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 71వ వార్డు చట్టివానిపాలెం సర్వీసు రోడ్డు పక్కన అనధికారికంగా నిర్వహిస్తున్న చికెన్ దుకాణం నిర్వాహకులు కోడి వ్యర్థాలను పక్కనే ఉన్న డ్రైన్లలో పారవేయడం తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తోంది. కాలువలో భారీగా వ్యర్థాలను పారవేయడంతో తీవ్ర దుర్గంధంతో పాటు డ్రైన్ పూర్తిగా కాలుష్యమయంగా మారిపోయింది. వీటిని పందులు తిని జనావాసాల్లో సంచరిస్తూ భయాందోళనలు కలిగిస్తున్నాయి. వెంటనే సదురు చికెన్ షాపును ఈ ప్రాంతం నుంచి తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

స్టీల్‌క్లబ్‌లో స్విమ్మింగ్ కోచింగ్ క్యాంప్ ప్రారంభం



కోచింగ్ క్యాంప్‌ను ప్రారంభిస్తున్న స్టీల్‌ప్లాంట్ సీజీఎం శ్రీనివాసరావు

ఉక్కునగరం: సెక్టార్-1లోని స్టీల్‌క్లబ్‌లో స్విమ్మింగ్ కోచింగ్ క్యాంప్ ప్రారంభమైంది. స్టీల్‌ప్లాంట్ హెచ్‌ఆర్ సీజీఎం కె. శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా హాజరై క్యాంప్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్లబ్ ఆధ్వర్యంలో స్విమ్మింగ్ శిక్షణ ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. శిక్షణలో అవసరమైన జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. క్లబ్ కార్యదర్శి జి. నారాయణదొర మాట్లాడుతూ తమ కమిటీ ఆధ్వర్యంలో స్విమ్మింగ్ పూల్, జిమ్‌కు చెందిన కొన్ని వస్తువులు కొనుగోలు చేసి సభ్యులకు అందుబాటులో ఉంచామన్నారు. సభ్యులు కాని వారికి కూడా శిక్షణ ఇస్తామన్నారు. కార్యక్రమంలో కమిటీ సంయుక్త కార్యదర్శి కె. శ్రీనివాస్, కోశాధికారి ఆర్. సత్యనారాయణ, ప్రతినిధులు కె. సత్యనారాయణ, వీరాస్వామి, కె.ఎల్. నర్సింహం, ఎం. కృష్ణారావు, చిట్టిబాబు, వి.ఎస్.బి. రాజు తదితరులు పాల్గొన్నారు.

గ్లకోమాపై అవగాహన అవసరం



గ్లకోమా వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో మాట్లాడుతున్న సూపరింటెండెంట్ డాక్టర్ ఉష

అగనంపూడి: గ్లకోమా వల్ల శాశ్వత అంధత్వం వచ్చే ప్రమాదం ఎక్కువగా ఉందని, ఈ విషయంలో అవగాహన కలిగి ఉండాలని అగనంపూడి ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఉష అన్నారు. గ్లకోమా (నీటి కాసులు) వారోత్సవాల ముగింపు కార్యక్రమం అగనంపూడి ఏరియా ఆస్పత్రిలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్లకోమా ఆరంభ దశలో కనుగుడ్డు చుట్టూ వలయాలు ఏర్పడడం, కంటి చూపు మందగించడం, కాంతి వంతంగా లేకపోవడం, కంటి చూపు క్రమేపీ తగ్గిపోవడం, కళ్లజోడు తరచూ మార్చాల్సి రావడం, నిలకడ లేకుండా తలనొప్పి రావడం జరుగుతుందన్నారు. కుటుంబ సభ్యుల్లో ఎవరికైనా గతంలో ఇలాంటి సమస్య వచ్చి ఉంటే వంశపారంపర్యంగా వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయన్నారు. సమయానికి సరైన చికిత్స జరగని పక్షంలో శాశ్వత అంధత్వం కలుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి ఆర్ఎంవో గోపాలకృష్ణ, సీనియర్ వైద్యుడు డాక్టర్ కల్యాణబాబు, ముఖ్యమంత్రి ఈ-ఐ కేంద్రం డాక్టర్ ఆశాశ్రీ (ఆప్తమాలజీ), రాజశేఖర్, పీఎంవో సరళ తదితరులు పాల్గొన్నారు.

ఎర్నిమాంబకు అభిషేకాలు



విశేష అలంకరణలో అమ్మవారు

కంచరపాలెం: జ్ఞానాపురంలో వెలసిన ఎర్నిమాంబ అమ్మవారి ఆలయంలో ఫాల్గుణమాసం ద్వాదశి ఆదివారాన్ని పురస్కరించుకుని భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ నేతృత్వంలో పూజారి శ్రీకాంత్ శర్మ ఉదయం నుంచి అమ్మవారికి కుంకుమ పూజలు, విశేషార్చనలు, అభిషేకాలు, నిర్వహించారు. భక్తులకు ప్రత్యేక ఉచిత దర్శనాలు ఏర్పాటు చేశారు. అమ్మవారి దర్శనానికి విచ్చేసిన భక్తులు సరైన నీడ లేక వర్షానికి తడిసి ముద్దయిపోయారు. మౌలిక వసతులు కల్పించాలని పలువురు భక్తులు కోరారు.

ఘనంగా తోట పోలమాంబ పండగ



అలంకరణలో పోలమాంబ



అమ్మవారి దర్శనానికి వేచి ఉన్న భక్తులు

గోపాలపట్నం: బాజి జంక్షన్ తోట పోలమాంబ కాలనీలో కొలువైన తోట పోలమాంబ అమ్మవారి పండగ మహోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి అధిక సంఖ్యలో స్థానికులు, భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. విద్యుద్దీపాలంకరణతో ఆలయాన్ని సుందరంగా ముస్తాబు చేశారు. సాయంత్రం ప్రధాన రహదారిలో ఏర్పాటు చేసిన పరస వద్ద జనం సందడి చేశారు. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

జాతీయ సమైక్యత శిబిరానికి ఏయూ విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి

ఏయూ క్యాంపస్: జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జాతీయ సమైక్యత శిబిరానికి ఆంధ్ర విశ్వవిద్యాలయం విద్యార్థులు తరలివెళ్లారు. డాక్టర్ వీఎస్ కృష్ణా కళాశాలకు చెందిన అధ్యాపకుడు డాక్టర్ పి.ఉమామహేశ్వరరావు ప్రోగ్రాం అధికారిగా ఎనిమిది మంది విద్యార్థులు ఎంపికయ్యారు. ఒడిశా రాష్ట్రం పూరీలో ఈ నెల 25వ తేదీ వరకు నిర్వహించే జాతీయ సమైక్యత శిబిరంలో ఏయూ ఎన్ఎస్ఎస్ విద్యార్థులు పాల్గొంటున్నారు. ఈ సందర్భంగా వారిని ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి తన కార్యాలయంలో అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి ఆచార్య ఎస్.హరనాథ్, తదితరులు పాల్గొన్నారు.

పోరాట యోధురాలు మల్లు స్వరాజ్యం



కామ్రేడ్ మల్లు స్వరాజ్యం చిత్రపటానికి పూలమాల వేస్తున్న సీపీఎం నేత జగ్గునాయుడు

సింధియా: నిజాం ప్రభుత్వాన్ని, పోలీసు బలగాన్ని ముప్పుతిప్పలు పెట్టించిన పోరాట యోధురాలు కామ్రేడ్ మల్లు స్వరాజ్యమని సీపీఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు అన్నారు. 63వ వార్డు క్రాంతినగర్‌లోని పార్టీ కార్యాలయంలో ఆదివారం స్వర్గీయ మల్లు స్వరాజ్యం ప్రథమ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జగ్గునాయుడు మాట్లాడుతూ మల్లు స్వరాజ్యం 1981 నుంచి 2022 వరకు మహిళా ఉద్యమంలో అనేక పోరాటాలు చేసి ఆస్తి హక్కు, పని హక్కు, సాధికారత కోసం కృషి చేశారన్నారు. ఉయ్యాలా పాట పాడి పల్లెల్లో జనాన్ని కదిలించారన్నారు. స్వరాజ్యం స్ఫూర్తితో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాలపై పోరాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గంటా సత్యానారాయణ, వై.లక్ష్మణరావు, వాసు, నరేష్, సత్తిబాబు, వై.గంగాధర్, బి.రాంబాబు, విమల, ఈశ్వరమ్మ, రాజు పాల్గొన్నారు.



